## క్లుప్తంగా

### సచివాలయ భవనం పరిశీలన



**కోవూరు :** మండలంలోని గుమ్మలదిబ్బలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన అంశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి ఆకర్షణీయంగా భవనాన్ని తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఈఈ సుబ్బరాజు, డీఈలు గౌతమ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మోహన్‌రావు, ఏఈ పరమేశ్వరలింగం, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### ఇంటి వద్దకే మందులు



**మనుబోలు:** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల ముంగిటకే వైద్యసేవలతో పాటు ఖరీదైన మందులను సైతం అందజేస్తోందని మనుబోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి గేయ పూజిత తెలిపారు. బుధవారం ఆమె ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా క్రానిక్ డిసిజెస్‌కు, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులకు కార్పొరేట్ వైద్యశాలల్లో పెద్ద మొత్తం చెల్లించి కొనుగోలు చేయాల్సిన మందులను ప్రభుత్వం ఉచితంగా ఇంటి వద్దకే పోస్టల్ ద్వారా అందజేస్తుందని తెలిపారు. పేషెంట్ మెడికల్ రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా నయోదు చేస్తే మందులను నేరుగా ఇంటికే పంపిస్తుందన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి



**మనుబోలు:** ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. స్థానిక బైపాస్‌రోడ్డు వద్ద కొంతకాలంగా తిరుగుతున్న ఓ వ్యక్తి రెండ్రోజుల క్రితం స్పృహ లేకుండా పడి ఉండగా పోలీసులు గుర్తించి చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండొచ్చని వారు భావిస్తున్నారు. మృతుడు గుండు చేయించుకుని, బ్లాక్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు.

### ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**కోవూరు :** ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న వావిళ్ల మురళీకృష్ణ (33) మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా, నెల్లూరు నుంచి కోవూరుకు వస్తున్న ప్రైవేట్ టౌన్ సర్వీస్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు మూడేళ్ల చిన్నారి ఉంది. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

### డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**ముత్తుకూరు:** మండలంలోని వన్నెకుల అగ్ని క్షత్రియ కుల సంఘ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎంపీడీఓ లక్ష్మణకుమార్, సంఘ నాయకులు తాండ్ర బాచిరెడ్డి, గండవరం గోపాలకృష్ణ, తాండ్ర సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### పంట నమోదును వేగవంతం చేయాలి



**కొడవలూరు:** పంట నమోదును వేగవంతం చేయాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదేశించారు. కొడవలూరులో జరుగుతున్న పంట నమోదును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు వివరాలను ఉన్నతాధికారులు కోరిన వెంటనే అందజేయాల్సి ఉన్నందున వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. వరి పంటలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించి జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి 2 గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఏఓ వెంట వీఏఏ డీ శివజ్ఞాన, రైతులు ఉన్నారు.

# 'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారులకు ప్రోత్సాహం



పొదలకూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీపీఓ సుష్మితారెడ్డి



పొదలకూరు: వాలీబాల్‌లో పోటీ పడుతున్న మహిళలు

- జిల్లా పంచాయతీ అధికారిణి సుస్మితారెడ్డి
- సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

**పొదలకూరు :** గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం–ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందని డీపీఓ సుస్మితారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాకాణి రమణారెడ్డి స్టేడియంలో సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం డీపీఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీలతో క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తోందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సత్తా చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరై క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ టాస్ వేసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భోజన, వసతిని కల్పించారు. ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎంపీటీసీ ఎస్‌కే షాకీరాబేగం, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఎస్‌కే అంజాద్, ఎం రవికుమార్ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, ఐదు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

క్రికెట్ మహిళా విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వెంకటాచలం, టీపీగూడూరు, పొదలకూరు మండలాల క్రీడాకారులు నిలిచారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వెంకటాచలం, ముత్తుకూరు, పొదలకూరు మండలాల క్రీడాకారులు గెలుపొందారు. మహిళా విభాగంలో టీపీ గూడూరు, మనుబోలు, వెంకటాచలం జట్లు నిలిచాయి. బాడ్మింటన్ పురుషుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో పొదలకూరు, ముత్తుకూరు, టీపీగూడూరు, మహిళా విభాగంలో టీపీగూడూరు, ముత్తుకూరు, పొదలకూరు మండలాల క్రీడాకారులు నిలిచారు.

**ఉత్సాహంగా..ఉల్లాసంగా..**

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎన్నార్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సహంగా పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. తొలుత నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, పీ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: వాలీబాల్ పోటీకి ముందు టాస్‌వేస్తున్న జెడ్పీటీసీ నిర్మలమ్మ





పొదలకూరు: క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: క్రీడాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

## లంచం కేసులో ఉద్యోగికి మూడేళ్ల జైలు

**నెల్లూరు(లీగల్):** లంచం తీసుకున్నాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో కోవూరు కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కూకటి శివరామయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.20వేలు జరిమానా విధించారు. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సత్యవాణి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు సాలుచింతల ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ ఇలియాజ్‌బాషా కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో 1984 నుంచి పనిచేశాడు. ఈయనకు భార్య కొడుకు, ఇద్దరు కుమార్తెలున్నారు. 2005లో స్వచ్ఛందంగా రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. 2012లో అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఆయన సోదరి హస్నారా బేగం తన వదిన షేక్ జాకీరా బేగాన్ని 2013 మార్చిలో షుగర్ ఫ్యాక్టరీకి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెన్షన్, ఇతర బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేయించింది. హస్నారా బేగం ఈ విషయంపై సంబంధిత సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ శివరామయ్యను పలుమార్లు కలిసి దరఖాస్తును అధికారులకు పంపాలని కోరారు.

2013 సెప్టెంబర్ ఒకటో తేదీన ఆమె దరఖాస్తు విషయం అడగ్గా అందుకు ఆయన రూ.5 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆమె అదే నెల 5వ తేదీన నెల్లూరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 7న మధ్యాహ్నం ఫ్యాక్టరీలోని తన కార్యాలయంలో ఫిర్యాది నుంచి శివరామయ్య రూ.2 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రివేణి వాదించారు.

# ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలి



పొదలకూరు: దేగపూడిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



కోవూరు: వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

- డీడీఏ శివన్నారాయణ

**పొదలకూరు :** రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని డీడీఏ శివన్నారాయణ అన్నారు. మండలంలోని దేగపూడి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్త వెంకటేశ్వర్లుతో కలిసి డీడీఏ వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన పంట, పర్యావరణ పరిరక్షణ, మిత్రపురుగుల సంరక్షణ, చీడపీడల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల పంట దెబ్బతింటుందని తెలిపారు. అనంతరం దుగ్గుంటరాజుపాళెంలో మొక్కజొన్న పైరును పరిశీలించారు. కాండం తొలుచుపురుగు, కత్తెర పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు మూడు కిలోల చొప్పున వినియోగించాలని శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు సూచించారు. మొక్క సుడులలో 2 గ్రాముల వంతున వేయాలన్నారు. ఎకరాకు క్లోరాంట్రోనిలిప్రోల్ 60 మి.లీ.లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు లేదా స్పినోసాడ్ 60 మి.లీ.ను నీటిలో కలిపి ఆకుల సుడుల్లో పిచికారి చేయాలని సూచించారు. సర్పంచ్‌లు ఓబుల్‌రెడ్డి, వెంకటరమణయ్య, ఎంపీటీసీ కే రామిరెడ్డి, ఏడీఏలు కే శివనాయక్, మారుతిదేవి, ఏఓలు గీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి**

**కోవూరు :** వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను రైతులు పాటించాల్సిన అవసరం ఉందని కోవూరు ఏడీఏ సుజాత అన్నారు. స్థానిక కొత్తూరులో సాగుచేసిన వరి పంట పొలాలను బుధవారం ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడడం వల్ల తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాలన్నారు. విచక్షణా రహితంగా క్రిమిసంహారక మందులు వాడడం పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు మెహరున్నీసా ఉన్నారు.

## నేడు మంత్రి కాకాణి రాక

**పొదలకూరు :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరులో గురువారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కాకాణి రమణారెడ్డి స్టేడియానికి విచ్చేసి సర్వేపల్లి నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలుగా నిలిచివారికి బహుమతులు ప్రదానం చేస్తారని వివరించారు.

**ముత్తుకూరు:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరులో గురువారం ఉదయం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే 4వ విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారని వెల్లడించారు.

## పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుందన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు షకీల, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ట్రైసైకిళ్ల వితరణ



ట్రైసైకిళ్లను వితరణ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**ఇందుకూరుపేట:** మండలంలోని ముగ్గురు దివ్యాంగులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను బుధవారం వితరణ చేశారు. మైపాడుకు చెందిన పామంజి భాస్కర్, ఇందుకూరుపేటకు చెందిన సుభాని, ఏడోమైలుకు చెందిన గుమ్మడి మనోహర్‌కు ఒక్కొక్కటి రూ.35 వేలు విలువ చేసే మూడు సైకిళ్లను అందజేశారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఏ ల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు ఉడతా వెంకటశేషయ్య, కైలాసం శ్రీనివాసులురెడ్డి, టీ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి

**కోవూరు:** సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాంకేతిక అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆత్మకూరు, పొదలకూరు, నెల్లూరు, కోవూరు డివిజన్లకు సంబంధించిన పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టే నిర్మాణ పనులను ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్‌లను నిశితంగా పరిశీలించాలన్నారు. భవన నిర్మాణాలకు సంబంధించి బేస్‌మెంట్‌లను నాణ్యతో చేపట్టేలా చూడాలన్నారు. సాంకేతిక అంశాల్లో సందేహాలు వస్తే ఏఈలను అడిగి తెలుసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావం తప్పనిసరి అన్నారు. అనంతరం ఈఈ సుబ్బరాజు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈలు గౌతమ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మోహన్‌రావు, ఏడుకొండలు, సంబంధించిన ఏఈలు ఉన్నారు.

## ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్వో బాపిరెడ్డి

**కోవూరు :** కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటరు జాబితాను ప్రచురించామని, అందులో ఏమైనా తప్పొప్పులు ఉంటే వెంటనే పరిశీలించుకుని సమాచారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా తుది ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. 18 ఏళ్లు నిండి ఇంకా ఓటు నమోదు చేసుకోని వారు ఉంటే నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కోవూరు ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య పాల్గొన్నారు.

# బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



వెంకటాచలం: విక్రమ సింహపురి వర్సిటీలో..

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

**వెంకటాచలం:** బాలికలు ప్రాథమిక విద్యకే పరిమితం కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి వర్సిటీ(వీఎస్‌యూ)లో బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బాలికలను మధ్యలోనే చదువు మాన్పించే ధోరణికి స్వస్తి పలికి ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యతోనే బాలికలు అన్ని విషయాలు తెలుసుకోగలుగుతారన్నారు. మహిళలపై జరిగే అన్యాయాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని, తద్వారా బాలికలపై జరిగే నేరాలు నియంత్రణలోకి వచ్చాయన్నారు. మెడికల్ ఆఫీసర్ టీ లక్ష్మి పోషకాహారం, ఆరోగ్య నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఉదయ్‌శంకర్, విజయ, మధుమతి పాల్గొన్నారు.

**ఆడపిల్లలను సంరక్షించుకుందాం**

**మనుబోలు:** ఆడ పిల్లలను సంరక్షించుకుందామని బద్దెవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్దెవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బాలికా సంరక్షణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. శారీరకంగా, మానసిక పరిపక్వత లేని చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాలికలు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు దొరసానమ్మ, ఉమామహేశ్వరి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి

**నెల్లూరు(దర్గామిట్ట):** జగనన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లను గ్రామ సచివాలయాల్లో ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న లే అవుట్ల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ బుధవారం నిర్వహించారు. . గ్రామ సచివాలయాల్లో గ్రామ కార్యదర్శికి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హోదా కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేసేలా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందని వివరించారు. డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయనే అంశమై నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌పై ఎంపీడీఓలు శ్రద్ధ వహించాలన్నారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలపై టెస్టిమోనియళ్లను ఈ నెల 31లోపు అప్‌లోడ్ చేయాలని వలంటీర్లకు సూచించారు. ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలను ఈ నెల 31న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారని, నియోజకవర్గ స్థాయి పోటీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత పాల్గొన్నారు.

## నేడు ఉదయకళేశ్వరస్వామి ఆలయంలో వేలం పాటలు

**కొడవలూరు:** గండవరంలోని ఉదయకళేశ్వరస్వామి ఆలయంలో తాత్కాలిక దుకాణాల నిర్వహణ హక్కులకు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే మార్చి 4 నుంచి 12వ తేదీ వరకు టెంకాయలు, పూజాద్రవ్యాలతో పాటు ఇతర తాత్కాలిక దుకాణాలు, కొబ్బరి చిప్పల సేకరణ, రంగులరాట్నం, చెప్పుల స్టాండ్‌కు వేలంపాటలు నిర్వహిస్తున్నామని చెప్పారు. టెంకాయలు, పూజా సామగ్రి దుకాణాలకు రూ.50 వేలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.25 వేలు, రంగులరాట్నానికి రూ.లక్ష, తాత్కాలిక దుకాణాలకు రూ.5 వేలు, చెప్పుల స్టాండ్‌కు రూ.5 వేలు వంతున ముందస్తుగా ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

## మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పొదుపు సంఘాల సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. ప్రభుత్వం అందజేసే రుణాలను జీవనోపాధికి ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలాబేగం, ఆర్పీ షబ్నం, హరిత, పొదుపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.